
# ఉత్సాహానందం

అరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి



"విూట్ మిస్టర్ జగన్నాథ్........"

పరిచయాలు అయ్యాయి.

డ్రాయింగ్ రూంలో వున్నవాళ్ళం ఎన మండుగురమైనా జగన్నాధమే అతిగా—ఆ మాటకొస్తే పూర్తిగా మాట్లాడుతున్నాడు.

మిగిలిన అందరమూ అతడి మాటలను తప్పనిసరిగా వింటున్నాము; ఎందుకంటే ఇంకెవరికీ అతడు పెదవి కదిపే అవకాశం ఈయడంలేదు గనుక.

వాళ్ళ ఆఫీసు విషయాలు, సర్వీసులూ, మార్కెట్‌లో పెరిగిపోతున్న ధరలూ—ఒక టేమిటి, అన్ని విషయాలపై అనర్గళంగా ఓ గంట మాట్లాడాడు. ఇంతసేపూ మాట లాడినా అతడి స్వరంలో అలసట లేదు; ముఖంలో దరహాసం అలాగే వున్నది దర్పం చెదరకుండా.

కానీ వింటూన్నవాళ్లే అలసిపోయినట్టు కన్పట్టారు.

రెండవసారి టీ, బిస్కెట్లూ, పళ్ళూ సర్వ్ చేయాల్సిన డ్యూటీ పడింది నా మీద.

ఆ కారణంగా అక్కడినుండి లేచివచ్చే అవకాశం కలిగినందుకు సంతోషిస్తూ మిసెస్ సింగ్ కూడా నాతో లోపలికి వచ్చేసింది.

"అబ్బ! ఇదెక్కడి బోర్! గొప్ప స్నేహితుడినే పట్టుకొచ్చారు మీవారు" అన్నది నాతో.

నేను నవ్వేశాడు.

"ప్రతి విషయంలోనూ తమకు మంచి 'నాలెడ్జి' వుందనుకోవడం, ఆ విజ్ఞానాన్ని అందరికీ ప్రదర్శించి ఆకర్షిస్తున్నామనుకోవడం కొందరి లక్షణం, అతిగా మాట్లాడుతున్నట్లు వాళ్ళకు తెలియదు పాపం!" అన్నాను.

"ఎవరికటా దిక్కుమాలిన 'అట్రాక్షన్'? ముప్పైలు పైబడి ముగ్గురేసి పిల్లల తల్లులం మనమూ, ఆయన చూస్తే అరవై దగ్గరలో వున్నట్లున్నాడు!"

ఉప్పెనగా వచ్చింది నవ్వు.

"రోజూ కొడుకులూ కోడళ్ళూ కూతుళ్ళూ మనుమలూ అందర్నీ ఇలా బోరెత్తిస్తుంటాడు కాబోలు! పాపం ఆ పెళ్ళాం ఎలా విని భరిస్తుందో కానీ ఈ అతిఘోరణిని!"

"యేమో? ఇంతకూ భార్యాపిల్లలూ వగైరా వున్నారో లేరో నాకూ తెలియదు. ఈ రోజే నాకూ ప్రధమ పరిచయం అతడితో."

"ఉంటే వాళ్ళ ఖర్మ. మనం మాత్రం ఇలాంటి వాగుడుకాయలనూ, చొప్పదంటు సోదినీ భరించలేం. మీవారి 'టేస్టూ', ఓపికా ఏమిటో నాకు తెలియదుగానీ........"

ఆమె మరీ అతిగా నిరశించి, విమర్శించు తూన్న దన్పించి నేను మౌనం వహించాను.

నేను టీ సరంజామాతో మళ్ళా డ్రాయింగ్ రూంలో అడుగుపెట్టేసరికి వాతావరణం మంచి పట్టులో వున్నది.

జగన్నాథ్ తన అనుభవాలేవో వివరించుతున్నాడు; శ్రోతలందరూ విపరీతంగా నవ్వులూ కేరింతలలో మునిగి తేలుతున్నారు.

"ఆ మధ్య నేను ఢిల్లీ వెళ్తున్నాను పని మీద. ఎదుటి బెర్తులో అమ్మాయి—ఓ ఇరవై ఏళ్ళుంటాయి. స్టూడెంట్‌లా వుంది. మంచి నవనాగరిక అలంకరణతో వున్నది లెండి ......"

వింటూన్న అందరి వదనాలలో కుతూహలం కన్పట్టింది.

వక్త ఉత్సాహం యినుమడించింది.

"ఒక్కతే ప్రయాణం చేస్తోంది........"

వినేవారు మరింత కుతూహలంతో ముందుకు వంచారు మెడలు.

"రైలు కదిలింది. ఆవిడగారు హాండ్ బ్యాగ్ తెఱచి మేకప్ సరిజేసుకుంటోంది. మళ్ళీ పౌడర్ కొట్టింది ముఖాన అంగుళం మందాన. బుగ్గలకు రంగు పులిమింది. పెదాలకు రంగు పులుముతూ నావైపు ఓ చూపు పారేసింది........"

అందరూ ఆత్రంగా వింటున్నారో లేదోనని చుట్టూ చూచి మరలా ప్రారంభించాడు. "నేను అటే చూస్తున్నానని కొంచెమైనా సిగ్గు కూడా లేదు. లిప్‌స్టిక్ పులుముకుంటూనే 'మీ రెక్కడికి వెళ్తున్నారు బాబూజీ?' అడిగింది. చూశారా? చూశారా ఆ గర్వం? నేను అదరిపడ్డాననుకోండి. అవ్వటానికి నా కంటె వయసులో కొంచం చిన్నదే అనుకోండి—కానీ మరీ 'బాబుగారూ' 'తాతగారూ' అనాల్సినంత ముసలివాడినా? కుటుంబంలో ఏదో అనుకోని బాధలు వచ్చి మనస్తాపాలవల్ల ఇలాగైపోయినా కానీ పట్టుమని నలభై యేళ్ళైనా లేవాయె నాకు! చిన్నతనంలో పెళ్ళవ్వబట్టి పిల్లలున్నారు గానీ, అసలు ఈ రోజుల్లో అందరూ ఈ వయసులోనేగా పెళ్ళిళ్ళు చేసుకుంటున్నదీ?"

శ్రోతలంతా విడ్డూరంగా ముఖముఖాలు చూచుకున్నారు.

జగన్నాథ్ ఇదేమీ పట్టించుకోకుండా అనర్గళంగా ఉపన్యాసం కొనసాగించుతూనే వున్నాడు.

"నేనేనా అంత తీసిపోయాను? 'ఢిల్లీ వరకూ వెళ్తున్నాను మాతాజీ, మిరెక్కడికి అత్తింటినుంచి పుట్టింటికా లేక పుట్టింటినుంచి అత్తింటికా? ఒక్కరూ ప్రయాణం చేస్తున్నారేం ఎవరూ తోడు లేకండా?' అన్నాను. చూడండీ ఇక ఆ రంగుల కోటింగ్ ముఖం అమావాస్యలాగా మాడిపోయింది. మళ్ళీ నాతో మాట్లాడితే ఒట్టు!" మాటలు పూర్తి చేస్తూనే బొళబొళా నవ్వేశాడు.

కొద్దిగానైనా శృతి కలపనిదే బాగుండ

దన్నట్టుగా కొందరు బలవంతంగా నవ్వారు.

"ఇంత ముసలాడు బొత్తిగా ఇరవైయేళ్ళ కాలేజి కుఱ్ఱాడిలాగా మాట్లాడ్తూంటే అసహ్యంగా లేదూ?" అని గుసగుసలు పోతూ నన్ను మోచేతితో పొడిచింది మిసెస్ సింగ్.

ఎవరైనా గమనించగలరనే సంకోచంతో నేను సమాధానమీయకుండా, తలెత్తకుండా టీలు అందించడంలో నిమగ్నమయ్యాను.

"హా! టీ? థాంక్స్," ముఖమంతా నవ్వు పులుముకొని నా చేతినుండి టీ అందుకున్న జగన్నాథ్ వెంటనే కొద్దిగా రుచి చూచి—

"ఊ! ఫర్వాలేదు. కానీ, టీ త్రాగితే నా మిసెస్ తయారుచేసిన టీయే త్రాగాలి. ఆహా! ఆ చేతిలో ఏం అమృతం వున్నదో కానీ ఇంక ఎవ్వరిచ్చిన టీ అంత రుచి రాదండీ! అన్నట్లు........మీరు మిసెస్ జగన్నాథ్‌ను కల్సుకున్నారా ఎప్పుడైనా?" అనడిగాడు నన్ను సూటిగా.

"లేదండీ! మిమ్మల్నికూడా ఇదే ప్రథమంగా చూడడం."

"చ్చు చ్చు చ్చు చ్చు," చాలా విచారం వెలిబుచ్చాడు! "వెరీ నైస్ లేడీ. డెఫినిటే యూ విల్ లైక్ హర్. ఐయామ్ ష్యూర్!"

సమాధానం ఏమి చెప్పవలెనో తెలియక నేను అలాగే చూడసాగాను.

"చాలా మంచి పేరున్నది నా శ్రీమతికి మా వీధిలో. ఎవరి కే సలహా కావలెనన్నా 'మిసెస్ జగన్నాథ్' అనుకుంటూ పరుగెత్తుకు వస్తారు. వెరీగుడ్ నేచర్! ఇంతకీ మీరు చూడనే లేదుగా ఆమెను? రండి మా యింటికి. ఇక మీరసలు ఆమెను వదలనే వదలరు. వెరీ సింపుల్ లేడీ మరలా ఏమనుకున్నారో! తానంత అందగత్తెనన్న గర్వమే లేదు!"

మిగిలినవారి విషయమేమోగానీ నేను మాత్రం అదిరిపడ్డాను.

ఎంతటి గౌరవారాధనలు అతడికి భార్యపై! పదిమంది సమక్షంలో భార్యను పలువిధాల ప్రశంసించగలంత ఆరాధనలో ఆ భర్త వున్నాడంటే ఆమె ఎంతటి సౌందర్యవతో!

జగన్నాథ్ వాక్పటిమ సాగిపోతూనే వున్నది.

"కానీ తాను సౌందర్యవతిననీ తెలివైనదాననీ అసలు విరగబాటే లేదనుకోండి. ఈ కాలపు వాళ్ళలాగా లిప్‌స్టిక్‌లూ హెయిర్ స్టైయిల్సూ అసలు అవసరంలేదు. అవేమిటో ఎరగదనుకోండి. టూ సింపుల్! ఆ మధ్య మా బావమరది పెళ్ళికి ఢిల్లీ వెళ్ళినపుడు వాళ్ళ అక్కచెల్లెళ్ళంతా ఎంత బలవంతం చేసినా పెదాల రంగులు కానీ బుగ్గలరంగులు కానీ అస్సలు ముట్టుకోలేదు.

'విమల మరీ పాతకాలంగానే వుండిపోయింది. ఏమీ మారలేదు' అని కొందరు ఆశ్చర్యపోయారు.

'సహజ సౌందర్యవతికి రంగులెందుకులె' మ్మన్నారు మరికొందరు."

ఈ ఆరాధనా గద్యం అసంపూర్తిగానే ఆగిపోయింది నాకు ట్రంక్ కాల్ రావడంతో.

బ్రేక్‌కోసమే చూస్తున్నట్లున్నారు అంతా— అవకాశం దొరకగానే గబగబా లేచారు.

"పెళ్లాం. పిల్లలు స్కూలునుంచి వచ్చే వేళైంది" అని కొందరూ,

"ఏదో ప్రోగ్రాం వుంది" అని మరికొందరూ సెలవు తీసుకున్నారు.

మర్నాడుదయం పదకొండు గంటలకు మిసెస్ సింగ్ ఫోన్ చేసింది.

"నిన్న మేమంతా పారిపోయాక పాపం ఆ సోది అంతా మీరిద్దరే భరించినట్లున్నారు?"

సమాధానంగా నేను నవ్వేశాను.

"ఆ తర్వాత ఎంతసేపు జరిగింది పురాణపఠన?"

"పురాణమా?"

"అదే భార్యామణి-ఐమీన్-శ్రీమతి ఆరాధనా కావ్యపఠన, ఛ ఛ, సరైన పదాలు దొరికి చావడంలేదు."

"ఓ గంటసేపు."

"బాప్‌రే! మీ ఇరువురి ఓపికలూ మెచ్చుకు తీరాలి. ఇటువంటి చాటర్‌బాక్స్‌లు మీవారికి




అంత ఇష్టమా ఏం? నేనైతే 'టట్! ఇటువంటి వాళ్ళు స్నేహితులుగా పనికిరా' రని ఖరా ఖండిగా చెప్పేస్తాను సింగ్‌గార్కి."

"సారీ మిసెస్ సింగ్. మీకు తెలుసు నాది అటువంటి స్వభావం కాదని. ఉద్యోగ రీత్యా అనేకమందితో స్నేహపరిచయాలుండే వారిని ఎలా ఆంక్షలతో బంధించడం?"

"స్నేహాలు బయటవరకే, మన నెత్తిల మీదకూ ఇళ్ళమీదకూ ఎందుకండీ బాబూ! బై ది బై-ఆ విమలా సుందరిని చూడటానికి ఆహ్వానించలేదూ మిమ్మల్ని?"

"పిలిచాడు. వెళ్ళాలి ఓ రోజు. జస్ట్-కర్టెసీ కాల్."

"నాకు తెలియకడుగుతాను — అరవై ఏళ్ళవాడిలా వున్నాడు—ఎంత లేదన్నా ఏభై పైనే వుంటుంది కదా భార్య వయసు? ఇంకా అంత అందంగా వుందంటారా? కొంపతీసి ఏ రెండోపెళ్ళో మూడోపెళ్ళో—కట్టు భార్య కాదుగదా! అందుకే అంతగా పొగుడుతున్నా డనుకుంటాను!"

"పాయింటే!"

"పాయింటేమిటండీ, నేనన్నది నూటికి నూరుపాళ్ళు నిజం కావచ్చు. అన్నట్టు........ మీరూ ఆమెనోసారి ఆహ్వానించండి. మేమూ చూచి తరిస్తాం!"

"అలాగే."

## 2

ఒక స్నేహితుల యింటికి వెళ్ళి వస్తూ, "ఈ పక్క వీధిలోనే జగన్నాధం యిల్లు, వెళ్దామా?" అన్నారు.

సరే నన్నాను.

ఇల్లు తేలికగానే తెలుసుకున్నాం.

ఇద్దర్ని అడిగితే ఇద్దరూకూడా వెంటనే, 'ఓ ఆ జగన్నాధ్‌గారా!' అని నవ్వుతూ వెంటనే ఓ యింటిని చూపించారు.

నిజంగా బాగా పరపతి వున్నవాడే కాబోలు! అడగగానే చెప్పారు!

ఇల్లు చిన్నది. పూర్వకాలపుది. అటూ ఇటూ గదులు వేసి పెంచుతున్నట్లున్నారు. ముంగిట ఖాళీస్థలమూ వరండా అన్నీ గలీజుగా వున్నాయి. ఇంటి తలుపులు మూసి వున్నాయి. కాలింగ్‌బెల్ వగైరా ఏమీ

కన్పించలేదు. ఎలా పిలవడమా అని సందేహిస్తూ నిలబడ్డాం.

రోడ్డుకు రెండవ ప్రక్క ఖాళీ స్థలంలో ఇటుకలూ, సున్నం, రాళ్ళు గుట్టలుగుట్టలుగా వున్నాయి.

మేస్త్రీలూ, కూలీలూ, అంతా అక్కడే వున్నారు బీడీలు తాగుతూ, కబుర్లు చెప్పుకుంటూ. తాత్కాలికంగా విశ్రాంతి తీసుకుంటున్నట్లున్నారు.

పారతో సున్నంతీసి గమేళాలు నింపుతూ కూలీలను త్వరగా లెమ్మని అరుస్తూన్న ఆడ మనిషి పార అక్కడ పారవేసి పరుగువంటి నడకతో వచ్చింది నవ్వుముఖంతో.

"జగన్నాథ్ సాబ్ బయటకు వెళ్ళారు. ఇపుడిపుడే పది నిముషాలైంది." అన్నది పైకి ఎగగట్టిన చీరకుచ్చెళ్ళు క్రిందికి లాగుతూ.

తైల సంస్కారం లేని దుబ్బుతలను బర బర గోకుతూ నిలబడింది.

"ఇప్పట్లో రారన్న మాటేగా?" అన్నాను.

"అంతేమరి," అన్నది తలను ఆ సున్నం చేతులతోనే గోక్కుంటూ.

"అమ్మా ఆకలే అన్నంపెట్టు" అంటూ వచ్చిన పదేళ్ళ పిల్లవాడిని కసిరింది కొంతసేపు ఆగమని. మాకు నమస్కారం పెట్టాడు ఆ కుర్రాడు.

ఫర్వాలేదు. బాగానే నేర్పుతోంది మర్యాదలు అన్పించింది.

బయటకు దారితీస్తున్న మమ్మల్ని,

"కూర్చోండి. ఆయన లేకపోతేనేం? వచ్చేస్తారు, తలుపు తీయనా?" అన్నది.

"వద్దు. మరో రోజు వస్తాం." అన్నాము.

"ఏమ్! లెగండి. ఇంకా ఎంత సేపు పనులు ఆపి కూచుంటారూ?" అని అరుస్తోంది ఇక్కడి నుండే పనివాళ్ళపై.

అందరిలోనికీ కొంత బాధ్యతగల మనిషి కాబోలు. తానూ వాళ్ళతోపాటు కూర్చోక పోగా అదలించుతోంది పాపం!

"ఇంతకూ ఆయన భార్య లోపలే వున్నదేమో? తలుపులకు తాళం లేదు," బయటికి వచ్చాక ధర్మసందేహం వెలిబుచ్చారీయన.

"వుంటే? మనను ఆమె ఎరుగదుగా? నడవండి పోదాం" అన్నాను ఆ పరిసరాలు కలిగించుతూన్న కంపరంతో.

## 3

అగ్రశ్రేణి నటీనటులు నటించిన గొప్ప పేరైన చిత్రం నడుస్తోంది ఊళ్ళో. ఎవరినోట విన్నా ఆ చిత్రం గురించీ, ముఖ్యంగా అందలి నాయిక వివిధ భంగిమలలో ఒలికించిన అందాలగురించే.

మేము థియేటర్‌లో సరిగా ప్రవేశిస్తూన్న వేళ జగన్నాథ్ బయటికి వస్తున్నాడు.

ఆప్యాయమైన పలకరింపుల అనంతరం "మీరు పిక్చర్ చూచి వస్తున్నారా?" అని అడిగాము.

"ఆఁ. ఫర్వాలేదు. ఏం పిక్చర్లు లెద్దురూ ఈ కాలంలోవి?"

"అరె! చాలా బాగుందని విన్నాము? మీకు నచ్చలేదూ?"

"ఈకాలపు జనానికి యింతకంటె 'టేస్టు' ఎక్కడేడిసిందిలెండి. పది రకాల రంగులు తలనుండి పాదంవరకూ పూసుకొని, విగులు పెట్టుకొని, విలువైన గుడ్డలు కట్టి తెచ్చుకొన్న అందాలేగా ఆ హీరోయిన్లవి! మేకప్ లేకుండా చూడండి. అసలు రూపం బయటపడ్తుంది. మా విమల చూడండి—మేకప్ అక్కర్లేదు - హెయిర్ స్టైల్ జోలికి పోనేపోదు. సహజ సౌందర్యం అంటే అదీ! అలాగుండాలి!"

నేను చిత్తరువువలె నిలబడిపోయాను.

'అంతటి అందాల తారను కూడ తీసికట్టు అనిపించేంత అతిలోక సౌందర్యవతా?'

నాలో ఉత్కంఠ పెరిగింది.

"ఏరీ ఆమె రాలేదూ మీతో?" అనడిగాను.

"వచ్చింది. అదిగో అక్కడెవరితోనో మాట్లాడుతోంది" అని దూరంగా దృష్టిసారించి చూపాడు.

ఒక జగదేకసుందరిని చూడబోతున్నాననే ఉద్వేగం మనసున నిండగా నా కనులు త్వరి

తంగా అటు తిరిగాయి.

కానీ నాకు అక్కడెక్కడా నామ మాత్రపు చక్కనిది కూడా కన్పట్టలేదు. ఎక్కువగా ఒకేవైపు ప్రత్యేకించి చూచే అవకాశమూ లేదు. జనం ఇసుక వేస్తే రాలనట్లుగా వున్నారు. మహాసముద్రం అలలలాగా తలలు కదలడమే కానవస్తూన్నది కానీ ఎవరెవరో చూడగల అవకాశమే లేదు! ఆ చిత్రానికి గల ప్రాశస్త్యం అటువంటిది మరి!

"సెలవుమరి. మరోసారి కలుసుకుందాం. వేళ ఔతోంది." అంటూ మేమె అతడికి వీడ్కోలు చెప్పి థియేటర్ లోనికి వెళ్లిపోయాం.

చిత్రాన్నిగురించి ఎన్నో ప్రశంసలు విన్నాను; పుస్తకాలలో కూడా సద్విమర్శలు చూచాను. నాయకీ నాయకులు తమ శక్తినంతా ధారపోసి నటించి చిత్రానికి ప్రాణప్రతిష్ఠ కావించారట; కథలో చక్కటి మలుపులు వున్నాయట.

అయితే, ఈ అన్నివిషయాలనూ విమర్శనాత్మకంగా చూచి ఆస్వాదించి ఆనందించగల అదృష్టం లేకపోయింది నాకు. చిత్రంలోని సుందరి ఒలికించిన హొయలను గమనించగల ప్రశాంతత కూడ లేదు మనసుకు!

నేను చూడని సుందరి—జగన్నాథ్ యొక్క ఆరాధ్య సుందరి నా మెదడంతా, మనసంతా ఆక్రమించి కూర్చున్నది. ఏ సౌందర్య సాధనాలూ అవసరంలేని అప్సరసా? నడివయస్సుకూడా దాటిపోయిన భర్త అహర్నిశలూ ఆ అందాన్ని ఆరాధించడమా? జీవితం ఒక ప్రేమ కావ్యం కావచ్చు!

అదేమాట నలుగురం కలిసినప్పుడు అంటే మిసెస్ సింగ్ తేలికగా తీసిపారేసింది.

"మరీ బడాయి! సౌందర్యవంతులైన భాగ




స్వాములున్నవాళ్ళు చాలామంది వుంటారు. అంతమాత్రాన అందరి ఎదుటా 'నా భార్య అందగాత్తె' అనీ 'నా భర్త నలకూబరు'డనీ అందరి ఎదుటా పొగుడుకునేవాళ్ళను ఎక్కడా చూడలేదు. మీ జగన్నాధ్‌కు ఏమైనా వేప కాయంత వెఱ్ఱిగానీ వున్నదేమో అసలు!" అనేసింది.

అందరూ పకపకా నవ్వకుండా వుండలేక పోయారు.

"ఆ మాటకొస్తే మనం అందరం మాత్రం ఏమాత్రం 'మేకప్' చేసుకుంటున్నామేమిటి? కాస్త స్నో, పౌడరూ, పొజిషన్‌కు తగ్గ మంచి దుస్తులూ. అంతేగా? మహా తన భార్యే నిరాడంబరి, మనమంతా విఱ్ఱవీగే వాళ్ళమూనా? మనం చాలా సింపుల్‌గా వుంటాం" అన్నది మిసెస్ రాధాకృష్ణ.

నేను కేవలం శ్రోతగా మిగిలిపోయాను. కానీ వారి మాటలు నాకూ సమంజసంగానే అన్పించాయి.

"అంతటి అందగత్తె గనుక ఆమెను యింట్లో పడవైచి తాళంవేసి తాను ఒక్కడే తిరుగుతాడనుకుంటాను బయట. రెండుమూడు సార్లు నాకు బజారులో ఒక్కడే కన్పించాడు" అన్నది మిసెస్ సింగ్.

మిసెస్ సింగ్‌కు అందర్నీ తేలికగా ఘోరంగా విమర్శించే అలవాటు వున్నప్పటికీ ఈనాటి విమర్శలు హేతు దూరం కాదన్పించింది.

ఎందుకంటే ఆ తర్వాత మూడు నాలుగు సార్లు మాకూ ఒక్కడే కన్పించాడు. అయితే ప్రతిఒక్కసారీ ఏదో ఓ మాటపై అవలీలగా భార్యామణి ప్రసంగం తీసుకురావడమూ ఆమె అద్వితీయమైన అందాలరాశి అనీ నిరాడంబరి అనీ శ్లాఘ వచనాలు ఆశువుగా విన్పించడమూ, ఆ కవితా ప్రవాహంనుండి మేము బలవంతంగా బయటపడి ఏదో ఓసాకుతో పారిపోవడమూ జరిగింది.

సాధారణంగా ఏ విషయంలోనూ అంతగా కుతూహలమూ ఆరాటమూ వుండని నాలో కూడ ఆ మిసెస్ జగన్నాధ్‌ను తప్పక చూడవలెననే ఉత్కంఠ ప్రబలం కాసాగింది రాను రాను.

అయితే ఎప్పుడూ అతడు ఒంటరిగానే కన్పిస్తాడెందుచేత?

ఇదొక భేతాళ ప్రశ్న అయి కూచ్చుంది.

## 4

స్కూళ్ళు తెరిచారు.

స్టేషనరీ సామాను కొనడానికి మార్కెట్‌కు వెళ్లేము. దుకాణంలో అప్పటికే కొనుగోలు చేయడం అయిపోయినట్లున్నది. చాలమంది వెళ్ళిపోతున్నారు. వారిలో జగన్నాధ్ కూడ వున్నాడు. మమ్మల్ని చూడనట్లే గబగబా వెళ్ళిపోయాడు. కానీ చూచాడని నాకు బాగా అనుమానం.

వెంట పదిహేను సంవత్సరాలు, పన్నెండు సంవత్సరాలూ, అయిదేళ్ళూ వయసుగల ముగ్గురు పిల్లలతోపాటు ఆనాడు వాళ్ళయింటి కట్టడపు పనిలోవున్న కార్మికులపై అజమాయిషీ చేసిన స్త్రీకూడా వున్నది కాస్త మెరుగనిపించే చీరతో, దువ్వుకున్న తలతో.

అయితే ఈమె నేననుకున్నట్లు పనిపాటల స్త్రీ కాదు; పిల్లలకు ఆయా అన్నమాట!

అయితే జగన్నాధ్‌కు ఆయాను పెట్టుకోగల స్తోమతు వున్నదా? అతడి భార్య మార్కెట్టుకుకూడా రానంత ఘోషా స్త్రీయా లేక ఏమైనా జబ్బుగా వున్నదా?


అన్నీ పిచ్చి ప్రశ్నలే నా తలలో.

అక్కడినుండి మేము బట్టల షాప్‌కు వెళ్ళాం. రెండు నిముషాల తేడాలో జగన్నాధంకూడా అక్కడికే వచ్చాడు. వెంట ఎవరూ లేరు.

మమ్మల్ని అప్పుడే చూచినట్లుగా విష్ చేశాడు.

"ఆ చేత్తోనే మా ఆవిడకు కూడా ఓ చక్కటి చీర సెలెక్ట్ చేద్దురూ," అన్నాడు నేను చూస్తూన్న చీరలను తానూ చూస్తూ.

నాకు బెదురూ, దడా ప్రారంభమైనాయి. 'ఇతడు మరలా సౌందరనంద పరన ప్రారంభించడు కదా' అని!




"చక్కటి రంగూ నాణ్యతా వున్నది చూచి తీయండి. ఈ కాలపు వెధవ వుల్లి పొర చీరలు ఆమెకు కిట్టవు!"

నేనూ దుకాణదారుడూ కూడా ఖంగారుపడి అటు యిటు చూచాం, ఎవరితో ఇప్పుడు అనవసర తగవు వస్తుందోనని, మరి అటువంటి ఉల్లిపొర చీరలూ దేవతా వస్త్రాలూ ధరించిన యువతులూ ప్రౌఢలూ చాలమంది వున్నారు అక్కడ బట్టల కొనుగోలుచేస్తూ. సేల్స్ గర్ల్స్ కూడ వున్నారు.

అదృష్టవశాత్తూ ఎవరూ వినివుండలేదు.

"చక్కటి రంగూ, అందమైన ప్రింటూ బోర్డరూ చూచి తీయండి—చాలా సింపుల్‌గా వుండాలి! ఆడంబరాలూ అట్టహాసాలూ ఆవిడ కసలు రుచించవు." అని హెచ్చరించాడు.

వెనకటికి ఓ మహాకాయురాలైన కురూపిణి తన ఫోటో అందంగా నాజూకుగా వుండాలని హెచ్చరించిందట ఫోటోగ్రాఫర్ని!

"ఆమెగారి అభిరుచీ, శరీరఛాయా మీకే తెలుసుగా? మీరే సెలెక్టు చేయండి" అన్నాను కానీ అతడి ముఖం మాడడం చూచి అలా అని వుండగూడ దన్పించింది.

'ముఖ్యంగా ఎంత ధరలో?' అనేది అతడు స్పష్టీకరించలేదు. గుట్టలు గుట్టలుగా చీరలు తీయిస్తూ మడత విప్పించి చూస్తూనే వున్నాడు.

అంతలో షోకేస్ వద్దకు వెళ్ళి అందులోని బొమ్మకు కట్టిన చీరను తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. నిజంగానే చాలా బాగుంది ఆ చీర.

ఓ అరగంట గడిచింది.

అటువంటి చీరలు ఎన్ని రంగులుంటే అన్ని చూపమన్నాడు.

ఆరువందలకు తక్కువ వుండదు దాని ఖరీదు. మరి అతడు కోరిన సింప్లిసిటీ లేదే అందులో?

అవన్నీ దుకాణంవాళ్ళు ఓర్పుగా చూపించారు.

అలా మరో గంట గడిచింది.

"ప్చ్, చాలా బాగున్నాయి ఈ చీరలు, తీరా కొని తీసుకెళ్తే ఆవిడ మెచ్చుతుందో లేదో? సహజ సౌందర్యం వుండాలేగానీ ఏ గుడ్డ అయితేనేం?"

భగవాన్! ధోరణి మొదలైంది. ఒక వంక నాకు జావ్యం అయిపోతోంది.

ఆఖరుకు అతడు ఏమీ కొనకండానే దుకాణంలోనుండి జారుకున్నాడు.

"తననే వచ్చి చూచి కొనుక్కోమంటే వినదుగా? 'మీరు తెండి నచ్చినది' అనేస్తుంది. నాతో సమంగా తిరగాలనిగానీ, సమాన హక్కులూ చట్టుబండలూ అని గెంతులేయడం గానీ అసలు రాదండి పాపం మా ఆవిడకు" అని చెప్పి మరీ వెళ్ళాడు.

మేము వెళ్ళకముందునుంచే దుకాణంలో వున్న ఓ నాగరిక ప్రౌఢ అంతా గమనించు తూన్నట్లున్నది—కిసుక్కున నవ్వుతూ అనేసింది:

"అమాయకుడు! సమాన హక్కులకోసం ఏడ్వవలసినవాడు తానుగానీ ఆవిడకేం? ఆమెగారి పరోక్షంలోకూడా ఇతడు ఆమె గుణగానం చేస్తున్నాడే—ఇక సమక్షంలో పాదాలు కడుక్కుని త్రాగుతాడేమో?"

## 5

ఎవరో స్నేహితులు ట్రాన్స్ఫర్ అయి వెళ్ళిపోతూన్న సందర్భంలో సాగనంపేందుకు స్టేషన్‌కు వెళ్ళాము. పరిచిత బృందం అంతా వున్నారు చాలావరకు.

హుషారుగా కబుర్లు చెప్తూన్న ఒకామె దూరానికి చూస్తూ "బాబోయ్!" అన్నది భయంగా.

ఏమిటోనని అంతా చూచాం.

పెద్ద పెద్ద అంగలతో నడచివస్తూన్న జగన్నాధం కన్పడ్డాడు.

"సోదె ప్రారంభిస్తాడు బాబూ. పట్టుకుంటే వదలడు" అంటూ కొందరు బుక్‌స్టాల్ వైపూ, ఇంకొందరు వెయిటింగ్ రూమ్‌లోనికీ, మరి కొందరు రెస్టారెంట్‌లోనికి పారిపోయారు.

నలుగురు కలసినచోట జగన్నాధంవిషయం ఒక నవ్వులాట సంగతై పోయిందీ నడుమ.

"అందరం పారిపోయినట్లు వెళ్ళిపోతే ఏం బాగుంటుంది? అతడి స్వభావం అతడిది మరి!" అనుకొన్న మేము మాత్రం అలా నిలబడే వున్నాం.

ఎప్పటి ఉత్సాహం వున్నట్లు కన్పట్టలేదు జగన్నాధం. చాలా మందకొడిగా పలకరించాడు మమ్మల్ని. మేము అక్కడ వున్న కారణం అడిగి తెలుసుకున్నాడు. తాను వచ్చిన వైనం వివరించాడు. ట్రెయినులో ఎవరో వస్తున్నారట. రిసీవ్ చేసుకోవాలి. అయిదునిముషాలు స్తబ్ధుగా నిలబడ్డాడు యెటో చూస్తూ. పూర్వం గల గల సెకనుకూడ వదలక మాట్లాడే అతడు యింత మౌనంగా అనాసక్తిగా నిలబడడం అబ్బురమే!

ట్రెయిన్ అరైవల్ టైమ్ అడిగి వచ్చారు యెవరో.

"రైళ్ళు వాటి యిష్టప్రకారం వస్తాయి. ట్రాన్స్‌ఫర్స్ అయిపోయే వాళ్ళు పోతూనే వుంటారు. మీరెంతసేపు నిలబడతారు పాపం అందుకోసమని? వెళ్ళండి. వెళ్ళిపోండి" అన్నాడు అమిత సానుభూతితో.

మేము వుంటే అతడికేం? ఎందుకో అంత సానుభూతి!

అయిదునిముషాలకోసారి అతడా మాట అంటూనే వున్నాడు.

నాకు విసుగూ చిరాకూ కలుగుతున్నాయి ఇదెక్కడి సతాయింపురా అని.

"మీకు రైలు ప్రయాణం యిష్టమేనా?" జగన్నాధ్ హఠాత్తుగా అడిగాడు నన్ను.

నేను సమాధానం ఆలోచించుతూన్నంతలో అతడే తన అమూల్యాభిప్రాయ నివేదిక ప్రారంభించాడు.

"ప్రయాణం చేయడం కూడ ఒక కళ అంటాను నేను. మా ఆవిడ అసలు ఆ కళ తెలిసినవారిలో అగ్రగణ్యురాలు!"


గర్వంగా నవ్వాడు.

'సెభాష్! ఈసారి భార్యగారి అందచందాలు కాక ఆవిడ అలవాట్ల వర్ణనకు పూనుకొన్నాడన్నమాట!'

"వెధవ ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణాలంటే ఆమెకు అసహ్యం. చక్కగా అందరి మధ్యనా మామూలు తరగతిలో సందడిగా ప్రయాణం చేయడమే ఆవిడకిష్టం. అందువల్ల రకరకాల

## (వి)చిత్ర విజ్ఞానం

పోలండ్‌లో మనలా వనమహోత్సవాలు జర పరు. ఉన్న వృక్షజాలాన్ని జాగ్రత్తగా కాపాడు కుంటారు. చెట్టుబోదెలో తొఱ్ఱ లేర్పడితే వాటిని అందంగా పూడ్చడానికి ఒక పద్ధతిని కనిపెట్టారు. చెట్టు తొఱ్ఱని మైలతుత్త ద్రావణంతో కడిగి, దానిని పాలియూరితేన్ నురుగుతో నింపుతారు. యీ నురుగు త్వరలో గట్టిపడి తొఱ్ఱను పూడుస్తుంది. పోలండులోని వార్సా నగరంలో చెట్లను అందంగా వుంచుకోడానికి ఒక ప్రత్యేక కేంద్రం నెల కొల్పారు.




---

విషయాలు తెలుస్తాయి కూడా! జ్ఞానం అధిక మౌతుంది. వెధవ 'కూపే'లో కూర్చుంటే ఏముంది - మనింట్లో మనం కూర్చున్నట్లేగా!"

అతడితో వాదించకుండా ప్రతిదానికీ ఆమోదం ప్రకటించడం కూడా ఒక కళేనని గ్రహించిన నేను చచ్చినట్లు అన్నిటికీ 'ఊఁ' 'ఊఁ' అని వూకొడుతున్నాను.

"ఇంతంతలేసి సామాన్లు వేసుకొని ఆర్భా టంగా చేసే ప్రయాణంలో కూడా సుఖం వుండదు అంటుంది మా విమల. సింపుల్— చాలా సింపుల్‌గా ఒకటో రెండో ఐటమ్స్ తీసుకువెళ్తుంది. అంతే!"

'ధన్యురాలు. ఆమెనుబట్టి నీవూ ధన్యుడవే' అని అనాలన్పించినా అనలేకపోయాను.

ఇన్ని మాట్లాడ్తూన్నా జగన్నాధంలో ఏదో ఆరాటం కానవస్తోంది. అసలు చురుకుగాలేడు.

ట్రెయిన్ రానే వచ్చింది.

వీడ్కోళ్ళూ, కృతజ్ఞతలూ, ఫోటోలూ వగైరా తంతులన్నీ ముగిశాయి.

అప్పటికి గుర్తించాను నేను జగన్నాధమూ అతడి హడావుడీ అక్కడ లోపించినట్లు.

అతడి ఫ్రెండ్స్‌ను రిసీవ్ చేసుకుంటున్నాడు కాబోలు!

యధాలాపంగా అటు చూచిన నాకు ఫస్ట్ క్లాస్ స్లీపర్ దగ్గర జగన్నాధం హడావుడిగా సామాన్లు దింపుతుండటం కన్పించింది. అతడి పిల్లలు బిలబిలా దిగివచ్చి అతడిని చుట్టూ ముట్టారు.

ఆయాకూడ దిగింది పిల్లల తర్వాత.

ఓ! అయితే అతడి 'ఫేమిలీ' అన్నమాట వస్తూన్నవాళ్ళు! జగన్నాధం చెప్పనేలేదెందుచేత?

ఇక్కడి స్నేహితులను కూడా వదిలి గబ గబా అటు నడిచాను.

గోనెమూటలూ, పాతగుడ్డల మూటలూ, వెదురుతట్టలూ, బుట్టలూ, బాగా సొట్టలుపడి తుప్పుపట్టిన ఒక రేకు బట్టలపెట్టె—వెరసి మొత్తం ఇరవైమూడు సామానులు మళాలా మళాలా లెఖ్ఖపెడుతోంది ఆయా. పిల్లలు మరీ మురికి ఓడుతూ, తల్లి ఏమేమి కొని ఇవ్వలేదో యేమేమి తిట్టిందో అన్ని వివరాలూ గోలగా ఏకరువు పెడ్తున్నారు.

ఇవన్నీ నా మనసుకు యెక్కడంలేదు.

కంపార్టుమెంటు ద్వారంపైననే నాచూపులు నిలిచివున్నాయి, శ్రీమతి జగన్నాధం రాకకై నిరీక్షించుతూ.

మొదటిసారి తాజమహల్‌ను చూడబోయి నపుడు వున్నట్లున్నది నా మానసిక స్థితి. ఉద్వేగం, ఆరాటం, ఆవేశం, ఆనందం-అనొక అనిర్వచనీయమైన నిరీక్షణా స్థితి. ఒక అపు

రూప సౌందర్యరాశిని చూడబోతున్నాను మరి!

కానీ ఎంతకూ ఆమె రాలేదేం?

ఇటు చూచాను.

జగన్నాధమూ, పిల్లలూ, ఆయా అందరూ తలో రెండు సామాన్లు చేతుల్లో పట్టుకుని నడక సాగించుతున్నారు.

"పదండ్రా సైన్యాలూ త్వరగా" అని హెచ్చరించుతోంది ఆయా చీరకుచ్చెళ్ళు పైకి యెగదోపి, నాల్గు సామానులను అవలీలగా మోసేస్తూ.

"జగన్నాధంగారూ, మీ శ్రీమతిగారు రానే లేదా?" నేను అడిగాను అతడికి దగ్గరగా అడుగులు వేసి.

అంతటి అద్వితీయ సౌందర్యరాశిని చూడ వలె ననుకున్న ఆతృత నిరర్థకం కాగా, నా స్వరం నాకే నీరసంగా విన్పించింది.

జగన్నాధం నీరసంగా చూశాడు.

అంతలో ఆయా ఫెళ్ళున నవ్వింది నన్ను ఎగతాళిగా చూస్తూ.

"అయ్యిందీ! మీరూ అందరిలాగే పొర పాటు పడ్డారన్నమాట?" అంటూ మరీ మరీ పడి పడి నవ్వింది, చేతిలో నున్న బరువులను క్రింద పెట్టి.

"మీరే కాదు—ఎవ్వరూ అనుకోరు నేను వారి భార్యనని చెప్పనిదే. ఇప్పుడు రైల్లో నాతో ప్రయాణం చేసినావిడా అలాగే అంటోంది "ఆయన మీ నాన్నగారా అమ్మాయ్?" అని.

"కాదమ్మా. ఆయన నాపిల్లలకు నాన్నగారు" అని నేను అనగానే అదిరిపడిందనుకోండి.

"ఆవిడే కాదు. ఎవరైనా అలాగే అను కుంటారనుకోండి. ఏం చేస్తాం? ఆయనముందు మరి నేను ఓ చదువుకునే పిల్లలా వుంటాను కానీ యిందరు పిల్లల తల్లిలా వుండనుగా? వస్తాను మరి?"

జగన్నాధం ఎక్కడా చుట్టుప్రక్కల లేడు.

నా పాదాలు భూమికి అతుక్కుపోయాయి. అంతకంతకు దూరమైపోతూన్న మిసెస్ జగన్నాధంపై నా చూపులు నిలిచిపోయాయి.

శ్రీమతి జగన్నాధం సౌందర్యవతా?యౌవన వతా? యే కోణంనుండి పరిశీలించినా నాకు అన్పించడంలేదు మరి!

"ఏమిటలా నిలబడిపోయారు? నడవండి. ట్రెయిన్‌కూడా వెళ్ళిపోయింది" అని స్నేహి తులు హెచ్చరించితే ఈ లోకంలోకి వచ్చాను.

"నిలబడి నిలబడి నీరసం వచ్చినట్లుంది. పాపం!" అన్నది మిసెస్ సింగ్.

నా నీరసానికి కారణం ఆవిడకేం తెలుసు.

"చూడు - ఆ నడచిపోతూన్న ముదురాకు పచ్చచీరామె నీకేమైనా అందగత్తెగా కన్పి స్తోందా? కనీసం వయసులో అందగత్తెగా వుండివుంటుందంటావా?"

వెనుకబడిపోతూన్న పిల్లలను హెచ్చరించ టానికి సరిగా అదే సమయంలో జగన్నాధం భార్య ముఖం యిటు త్రిప్పింది.

పరీక్షగా చూచిన మిసెస్ సింగ్ నన్ను విస్మయంగా చూచింది.

"చీ, ఎవరామె?" అన్నది.

వివరాలు చెప్పగల ఓపిక లేదు నాలో.

మాట మార్చాను.

కానీ ఆ దంపతుల మనస్తత్వాలేమిటో నాకు అర్థం కావడం లేదు.


పూర్వం ఒకవిధంగా, ఇప్పుడు మరొక విధంగా వాళ్ళు అనునిత్యం నా మెదడులో మెదలుతూనే వున్నారు.

జగన్నాధం నాతో పరిహాసంగా గానీ అన్నాడా ఆ స్త్రీ తన భార్య అని?

ఇదే అనుమానం వ్యక్తీకరించాను మాయ వద్ద. డాక్టర్ మాయ నాకు మంచి స్నేహితు రాలు. ఒకనాడు మేమిద్దరం మాట్లాడుకుం టూన్న తరుణంలో మిసెస్ జగన్నాధ్ వచ్చింది జ్వరంగావున్న పిల్లతో. పిల్లా తల్లీ- ఒకరితో ఒకరు పోటీపడ్తూన్నట్లున్నారు మురికి తనంలో. తైలసంస్కారమెరుగని తలలు.

ఆమె నిష్క్రమించాక డిస్పెన్సరీలో గాలి వాన వెలిసినట్లే అన్పించింది.

రెండు నిముషాలలోనే మరలా తిరిగి వచ్చింది.




"అన్నట్టు........డాక్టర్! పిల్లకు యిలా జ్వరంగావున్నట్లు మీ సర్టిఫికేట్ కావాలట. ఆ పంతులమ్మ అన్నది నిన్న వెళ్తే."

మాయ మౌనంగా ఆ పత్రం వ్రాస్తోంది.

"అన్నట్టు. . ....ఈ పిల్ల మా అమ్మాయి. అనగా నా కూతురే. తెల్సుగా మీకు? నిన్న ఆ పంతులమ్మ 'మీ చెల్లెలా?' అనడిగింది! మరి నేను అంత వయసువున్నట్లు కన్పించనుగా? ఏదో చిన్నతనంలోనే పిల్లలు పుట్టుకొచ్చారు గానీ........"

కాగితం తీసుకుని వెళ్ళిపోయింది మిసెస్ జగన్నాధ్.

ఈ ధోరణి అలవాటేనన్నట్లుగా మాయ చిరునవ్వు నవ్వింది.

నేను ఆశ్చర్యంగా చూచాను మాయ దెస.

"ఇవొక వింత స్వభావాలు!" అన్నది చిరు నవ్వుతో.

"మీకు వీళ్ళు బాగా తెలుసా?"

"ఆఁ! తాము అందంగా మిసమిసలాడుతూ అందరినీ ఆకర్షించలేకపోతున్నామనే న్యూనత; వయసుతో వచ్చే మార్పులను దర్పంగా ఆహ్వానించలేని పిరికితనం కొందరిని ఇలా హాస్యాస్పదంగా మాట్లాడేట్లు చేస్తుంది."

"జగన్నాధ్ కూడా......." అర్ధోక్తిలో ఆపేశాను.

"ఆఁ! ఈ భార్యాభర్తలిద్దరూ కూడా ఒకే జబ్బుతో పీడింపబడుతున్నారు దురదృష్ట వశాత్తూ."

"జబ్బా?"

"ఆఁ ఇదొక మానసికమైన జబ్బు. చాలా అందంగా వుండాలనే తీవ్రమైన కోరిక వుండి వుంటుంది. కానీ ఇది బజారులో దొరికే వస్తువు కాదు. పోనీ జీవిత భాగస్వామి అయినా అతి సౌందర్యమూర్తి కావాలని అనుకొని వుంటారు. ఆ ఆశకూడ తీరక అదొక రకమైన మానసిక చింతతో అనునిత్యం బాధ పడ్తారు. నలుగురూ తమ కురూపాలను చూచి నవ్వుకుంటున్నారేమోననే దిగులు నిత్యం వుంటుంది. దీనికి తోడు వయసు తెచ్చే మార్పులను ఇటువంటివారు దర్పంగా ఆహ్వానించలేక మరింత కృంగిపోతారు. తామే అందంగా మెరసిపోతూ, నిత్యయౌవనంతో మిసమిసలాడ్తూంటే ఎలావుంటుందోననే ఊహలలో జీవిస్తారు. ఫలితంగా ఇలా పదుగురిలో నవ్వులపాలౌతారు!"

ఇప్పుడు జగన్నాధంగానీ అతడి భార్యకానీ కన్పించితే నాకు చికాకు కలుగదు. మనసు సానుభూతితో నిండిపోతుంది. □